క్లుప్తంగా

నేడు తపాలా సేవలపై సదస్సు

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలోని ఉప తపాలా కార్యాలయంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మూల రమాదేవి ఆధ్వర్యంలో ఈనెల 25న తపాలా సేవలపై అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఆకారపు అన్నమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టాఫీసుల ద్వారా పొదుపు ఖాతాలు, ఇన్సూరెన్స్, సర్టిఫికెట్లు, తదితరాలపై వినియోగదారులకు వివరిస్తారని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి రూ.50 వేల సాయం



శాయంపేట : మండలంలోని కాంట్రపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి ఆమెతో కలిసి 2002–03 విద్యాసంవత్సరంలో టెన్త్ చదువుకున్న స్నేహితులు ఆదివారం రూ.50 వేల సాయం అందించారు. అనంతరం శ్రీదేవి కుటుంబాన్ని ఆమె మిత్రులు పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒంటేరు వనమ్మ వీరస్వామి, నాయకులు రఘు సింగ్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ సర్పంచ్ పైండ్ల సంపత్‌ను అతడి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీతోపాటు మాజీ సర్పంచ్‌లు వల్లకొండ సురేష్, బరిగల సదానందం, కావటి స్వామి ఆదివారం పరామర్శించారు. తొలుత సంపత్ తల్లి రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు సంపత్‌కు సాయం అందజేశారు.

నివాళి



నడికూడ : మండల కేంద్రానికి చెందిన తొర్నె అనిల్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా అతడి మృతదేహానికి తెలంగాణ రైతు విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచ్ ఊర రవీందర్, ఉపసర్పంచ్ కిన్నెర మణి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో లోకాటి నగేష్, వరికేల కిషన్‌రావు, వాంకే రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఎంసీపీఐ(యూ)తో సంబంధం లేదు'

శాయంపేట : బీఆర్‌ఎస్‌లో పార్టీలో చేరిన మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన గాదం సాయిలు, కూసం బుచ్చయ్యలకు ఎంసీపీఐ(యూ)తో సంబంధం లేదని జిల్లా కమిటీ సభ్యుడు ఉస్మాన్, నాయకుడు పెంట తిరుపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయిలు, బుచ్చయ్య పార్టీ సభ్యులే కాదని పేర్కొన్నారు. ఎంసీపీఐ(యూ) నుంచి బీఆర్‌ఎస్‌లో చేరినట్లు ప్రకటించుకోవడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు.

నేటి నుంచి ఉచిత గుండె వైద్యశిబిరం

కాశిబుగ్గ: వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం నుంచి వారం రోజుల పాటు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డి శ్రవణ్‌కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అజిత్ మహమ్మద్ తెలిపారు. ఈమేరకు వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలను వైద్యులతో కలిసి ఆస్పత్రిలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలోని ఐదుగురు నిష్ణాతులైన గుండె వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు శ్రావణ్, లక్ష్మీనారాయణ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ స్కీములు అమలు చేస్తాం

హసన్‌పర్తి: అధికారంలోకి వచ్చిన మరుక్షణమే ఆరు గ్యారెంటీ కార్డులను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. గ్యారంటీ కార్డుల వాల్‌పోస్టర్లను మండలంలోని కోమటిపల్లిలో ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యకర్తలు ప్రచారం చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, ప్రకాశ్, మాదాను అజయ్, రాజు, బ్లాక్ కాంగ్రెస్ బాధ్యుడు తిరుపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పరకాల : అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ రజని





కమలాపూర్ : రాములపల్లిలో..

శాయంపేట : భక్తులకు భోజనం వడ్డిస్తున్న గండ్ర జ్యోతి



భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రులు

శాయంపేట : గణపతి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని నేతాజీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఉపసర్పంచ్, ఎంపీటీసీ–2 దైనంపల్లి జమున సుమన్ ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఏటా గణపతి నవరాత్రులను వేడుకగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అన్నదానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నిర్వాహకులను అభినందించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తొలుత చైర్‌పర్సన్ జ్యోతి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, సర్పంచ్‌లు అరికిల్ల ప్రసాద్, గుండెకారి రజిత శ్రీనివాస్, నాయకులు గడిపె విజయ్‌కుమార్, వినుకొండ శంకరాచారి, గాజె రాజేందర్, ఉత్సవ కమిటీ సభ్యులు అల్లం హరి, చెన్నబోయిన బుచ్చిబాబు, కుక్కల రమేష్, శంకర్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

పరకాల : పట్టణంలోని 13 వార్డులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కౌన్సిలర్ శనిగరపు రజని ప్రారంభించారు. అనంతరం కౌన్సిలర్ రజని మాట్లాడారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. కార్యక్రమంలో



ఆత్మకూరు : అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కౌన్సిలర్లు మడికొండ సంపత్‌కుమార్, మార్క ఉమాదేవి, బీఆర్‌ఎస్ నాయకులు బొచ్చు జేపీ, బొచ్చు ప్రణయ్, బొచ్చు రమేష్, బొచ్చు చంటి, బొచ్చు ఖుషి, బొచ్చు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలోని తిరుమలగిరిలోని బొడ్రాయి సమీపంలో గణపతి భక్త మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బూర రమేష్, దూడం రమేష్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, బాలకృష్ణ, శివకృష్ణ, చిరంజీవి, సాంబయ్య,గడ్డి వెంకటేశ్, అరవింద్ పాల్గొన్నారు.

కమలాపూర్ : మండలంలోని రాములపల్లి, ఇతర పలు గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద దాతల సహకారంతో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. మండల కేంద్రంలో వాసవి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద సూక రమ్య–సురేష్, శ్రీ గణేష



కమలాపూర్ : భోజనం వడ్డిస్తున్న సీఐ సంజీవ్

భక్త మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద తోకల చైతన్య–కనకరాజు, గజానన భక్త భజన మండలి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద చేరాల సమంత–జయకిశోర్, ఎంపీటీసీ మెండు రాధిక–రమేష్, కోట పద్మ–పున్నంచందర్, స్నేహ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద రామగిరి సుజాత–శ్రీధర్, వెనిశెట్టి పావని–పున్నంచందర్, మేడిపెల్లి వినీల–ప్రశాంత్, సిరుప సుశీల–శంకరయ్య దంపతులు, కిన్నెర శ్యాం సుందర్ తదితరులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్, ఎస్సై సీమా ఫర్హీన్ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. కులమతాలకు అతీతంగా ముస్లిం సామాజికవర్గానికి చెందిన ఎస్సై సీమా ఫర్హీన్ పాల్గొని భక్తులకు భోజనం వడ్డించడంతోపాటు తనూ భోజనం చేయడం విశేషం. కార్యక్రమంలో నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు వింత రోగం

నడికూడ : మండల కేంద్రంలో కుక్కలకు వింత రోగం సోకుతోంది. అవి చర్మ సంబంధిత రోగాల బారిన పడుతుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలుండగా మండల కేంద్రంలో చర్మ సంబంధిత వ్యాధుల బారిన పడి కుక్కలు మృత్యువాత పడుతుండడం చోటు చేసుకుంటోంది. ఈ క్రమంలో రోగాల బారిన పడతామంటూ జనం భయపడుతున్నారు. మండల కేంద్రంలో కుక్కలు చర్మ వ్యాధులు, ఇతర రోగాల బారిన పడుతూ జనావాసాల్లో తిరుగుతున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులూ ప్రబలుతున్నాయి. పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో కుక్కలు రోగాలతో బాధపడుతూ జనాల్లో సంచరిస్తుండడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. కుక్కలకు ఎవరూ ఆహారం సైతం అందించడం లేదు. పలు కుక్కలు వింత రోగాల బారిన పడి చనిపోయిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లో కుక్కలు వింత రకానికి చెందిన అంటు వ్యాధి సోకి చనిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోగాల బారిన పడిన కుక్కలకు వైద్యం చేయడంతోపాటు వాటిని రక్షిత ప్రదేశాలకు తరలించాలని, గ్రామాల్లోనూ హెల్త్ క్యాంపులు నిర్వహించి సీజనల్ వ్యాధుల నుంచి జనాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



వింత వ్యాధితో బారిన పడిన కుక్క

అపరిశుభ్రతతోనే కుక్కలకు రోగాలు



అపరిశుభ్ర పరిసరాలతోనే కుక్కలు రోగాల బారిన పడుతున్నాయి. చెత్తాచెదారంతో కూడిన ఆహారాన్ని తింటుండడంతో కుక్కల్లో బాహ్య పరాన్న జీవులు చేరి వాటి చర్మం మీద వెంట్రుకలు రాలిపోతున్నాయి. ఇది అంటువ్యాధి కావడంతో వీధి కుక్కలకు వ్యాపిస్తోంది. పెంపుడు కుక్కలకు మూడు నెలలకోసారి డీవార్మింగ్ చేయించాలి.

–సూరం బాలకృష్ణ, మండల పశు వైద్యాధికారి

రానున్న ఎన్నికల్లో గెలుపు ఖాయం

● వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి

శాయంపేట : రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు ఖాయమని వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి తెలిపారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారికి చైర్‌పర్సన్ జ్యోతి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. ఎన్నికల హామీలను అమలు చేయడంతోపాటు ఎవరూ అడగకపోయినా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, తదితర పథకాలను సీఎం కేసీఆర్ సమర్థవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతిరెడ్డి, నాయకులు పోతు రమణారెడ్డి, ఎలమంచి జయపాల్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణు, సురేంద్రచారి, ఇంద్రయ్య పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో చైర్‌పర్సన్ జ్యోతి

మత్స్యకారుల అభివృద్ధికి ప్రాధాన్యం

ఐనవోలు : మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోందని రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ మునిగాల సంపత్‌కుమార్ తెలిపారు. మత్స్య శాఖ ద్వారా అందిన 1.75 లక్షల చేప పిల్లలను మండల కేంద్రంలోని ఊర చెరువులో సంపత్ ఆదివారం వదిలి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి చొరవ తీసుకుంటోందని తెలిపారు. మత్స్యకారులకు ద్విచక్ర వాహనాలను అందించినట్లు తెలిపారు. గత పాలకులు మత్స్య, ఇతర కుల వృత్తులను విస్మరించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే కులవృత్తులకు ఆదరణ, ప్రోత్సాహం లభిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు ప్రభుత్వం అందించిన చేప పిల్లలను వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఫీల్డ్ ఆఫీసర్ మేఘన, మత్స్యకారులు చిట్ల విద్యాసాగర్, సంపత్, ఉపేందర్, నారాయణ, వెంకటస్వామి, కొమురుమల్లు, రవి, శ్రీనివాస్, రమేష్, పరమేష్ వార్డు సభ్యుడు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లలను వదులుతున్న సంపత్‌కుమార్, నాయకులు

'నిరుద్యోగ యువతతో బీఆర్‌ఎస్ చెలగాటం'

శాయంపేట : నిరుద్యోగ యువతతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నరహరిశెట్టి రామకృష్ణ ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని, తదితర అనేక హామీలు గుప్పించి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని విమర్శించారు. గ్రూప్–2, గ్రూప్–4 పరీక్ష పత్రాల లీకేజీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలను, భవిష్యత్తును నాశనం చేస్తోందని మండిపడ్డారు. గ్రూప్–1 పరీక్ష రద్దుకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులంతా ఏకమై రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

● జిల్లా కోఆర్డినేటర్ ఇల్లందుల రవితేజ

కమలాపూర్ : కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం వైద్యపరీక్షలు చేయిస్తోందని సీఎస్‌సీ హెల్త్ కేర్ జిల్లా కోఆర్డినేటర్ ఇల్లందుల రవితేజ తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా లేబర్ కార్డు కలిగి ఉన్న 288 మందికి సీఎస్‌సీ హెల్త్ కేర్ సిబ్బంది ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి రక్త, మూత్ర నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ రవితేజ మాట్లాడారు. ల్యాబొరేటరీలో రక్త, మూత్ర, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె సంబంధిత, క్యాన్సర్, థైరాయిడ్, కొలెస్ట్రాల్, అంధత్వ, చెవిటి, మూగ తదితర 53 రకాల పరీక్షలు నిర్వహించిన అనంతరం రిపోర్టులను అందజేస్తామని తెలిపారు. తొలుత ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్మికులు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శిబిరంలో క్యాంపు కోఆర్డినేటర్ బీరెల్లి శశిధర్, డాక్టర్ గాయత్రి, టెక్నీషియన్లు రోజ, రమ, భరత్, తరుణ్, పవన్, వంశీకృష్ణ, సందీప్, వెంకన్న పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

దామెర : దేశం కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండల కేంద్రంలో 'మేరె మిట్టి–మేరే దేశ్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించి ఇళ్లలో నుంచి మట్టిని సేకరించారు. అనంతరం హనుమాన్ ఆలయంలో అమృత కలశానికి పూజ చేసి పంచప్రాణ్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. అమరుల స్మారకంగా దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ స్మృతివనం ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టితో అమరులకు గౌరవ సూచకంగా స్మృతివనం నిర్మించడంలో భారతీయులందరి భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు వేల్పుల రాజ్‌కుమార్, గన్ను సతీష్, నాయకులు ఎక్కలదేవి రమేష్, రాజాలు, కన్నె కొమురయ్య, రమణారెడ్డి, వేల్పుల సుధాకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.



మట్టిని సేకరిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

రైతుల కోసం గోదాం నిర్మాణం

సంగెం : రైతులకు ఎరువులు, ఇతర సేవలు అందించేందుకు సొసైటీ గోదాం నిర్మిస్తున్నట్లు కాపులకనిపర్తి సొసైటీ చైర్మన్ దొమ్మాటి సంపత్‌గౌడ్ తెలిపారు. మండలంలోని సోమ్లాతండా జీపీ అందించిన రెండు గుంటల భూమిలో గోదాం నిర్మాణానికి ఆదివారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. రైతులకు గోదాం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ మంగ్యా నాయక్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు సోలగుడి భాస్కర్, కిషన్ నాయక్, నాయకులు గోపాల్, రఘు సీతుకు రమణాచారి పాల్గొన్నారు.

'బహుజనులకే పట్టం కట్టాలి'

ఆత్మకూరు : రానున్న ఎన్నికల్లో బహుజనులకే పట్టం కట్టాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పూరెళ్ల రమేష్ కోరారు. ఆయన చేపట్టిన పాదయాత్ర మండలంలోని గుడెప్పాడ్ గ్రామానికి ఆదివారం చేరుకుంది. ఈ సందర్భంగా రమేష్ గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. జనాభాలో అతి తక్కువ సంఖ్యలో ఉన్న అగ్ర కులాల నాయకులకు ఓటేయవద్దని సూచించారు. బహుజనులను గెలిపిస్తే ప్రజల్లో ఉంటూ మెరుగైన పాలన అందిస్తారని చెప్పారు. బహుజనులను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజు, పాదయాత్ర ఇన్‌చార్జ్ రత్నాకర్, నాయకులు సిలువేరు రవి, మైదం రవి, కోడెపాక ప్రతాప్, మధు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో దోమల నివారణ

కమలాపూర్ : పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా దోమలను నివారించొచ్చని సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చిమొక్కలను 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. చెత్తాచెదారాన్ని రోడ్లపై వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందించాలని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ప్రజలు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కారోబార్ వెంకటరమణ, నాయకులు వావిలాల మురళి పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సామాజిక సేవా దృక్పథంతో ముందుకెళ్లాలి

విద్యారణ్యపురి: జాతీయ సేవా పథకం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు.. సామాజిక సేవా దృక్పథంతో ముందుకెళ్లాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ సూచించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు సామాజిక సేవ, సామాజికాభివృద్ధిలో భాగస్వాములు కావటం వలన వలంటీర్లలో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని వివరించారు. రక్తదాన శిబిరాలతోపాటు, హరితహారం వంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ –కి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సురభి వినోద్‌రావు, ఎన్‌ఎస్‌ఎస్ అడ్వయిజరీ సభ్యులు కమలాకర్ అధ్యాపకులు లింగారెడ్డి, సుజాత, పావని మాట్లాడారు. అనంతరం కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ ఈసం నారాయణను సన్మానించారు.



నారాయణను సన్మానిస్తున్న అధ్యాపకులు

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

విద్యారణ్యపురి: గ్రూపు –1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కావటం.. రాష్ట్ర ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యానికి నిదర్శనం అని, ఈక్రమంలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులను తొలగించాలని, కొత్త వారిని నియమించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని సెంట్రల్ లైబ్రరీ – పబ్లిక్‌గార్డెన్ రోడ్డుపై ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ వైఫల్యం కారణంగా నిరుద్యోగ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. నష్టపోయిన అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయికృష్ణ, స్టాలిన్, గ్రూప్–1 అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నాయకులు, అభ్యర్థులు

1న బుద్ధభవన్ పునర్నిర్మాణానికి భూమిపూజ

హన్మకొండ: హనుమకొండ కుమార్‌పల్లిలోని బుద్ధభవన్ పునర్నిర్మాణ పనులను అక్టోబర్ 1న ప్రారంభించనున్నట్లు బుద్ధ భవన్ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బీఆర్.అంబేడ్కర్, వంగల సుదర్శన్ తెలిపారు. ఈమేరకు బుద్ధ భవన నిర్మాణ స్థలం వద్ద ఆహ్వాన కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనులను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రారంభిస్తారని వివరించారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పునర్ నిర్మాణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బీఆర్.లెనిన్, గోశాలపు శ్యాం, కన్వీనర్ జితేందర్‌నాథ్, బాధ్యులు సారయ్య, సర్వేశ్వర్, గణేష్, వేణు, లక్ష్మణ్, సంజయ్, కన్ని, వినయ్, శోభారాణి, భాగ్యరాణి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

